సాక్షి అనంతపురం

ఆదివారం । 23 । ఫిబ్రవరి । 2025



చీనీ టన్ను రూ.20,700

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20,700 పలికాయి.



టమాట కిలో రూ.10

అనంతపురం కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.7, సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
37.8°/17.3°

జిల్లా అంతటా శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. చలి తీవ్రత తగ్గింది. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

పెట్రోల్ బంకులపై విజి'లెన్స్'



బంకులో పంప్‌లను పరిశీలిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని హెచ్‌పీ, పారిశ్రామికవాడలోని ఐఓసీ పెట్రోల్ బంకుల్లో శనివారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, తూనికలు కొలతల శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. రెండు రోజుల క్రితం అనంతపురంలోని ఓ పెట్రోల్ బంకులో చిప్‌ను అమర్చి మోసం చేస్తున్న ఉదంతం వెలుగుచూసింది. ఈ నేపథ్యంలోనే జిల్లా విజిలెన్స్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విజిలెన్స్ సీఐ సద్గురుడు, తూనికలు కొలతల శాఖ అధికారి శంకర్ పర్యవేక్షణలో టెక్నికల్ సిబ్బంది పెట్రోల్, డీజిల్ పంప్‌లను ఓపెన్ చేసి చూశారు.

కృత్రిమ కాలి కోసం పేర్లు నమోదు చేసుకోండి

అనంతపురం రూరల్: వికలాంగులు కృత్రిమ కాలు కోసం పేర్లు నమోదు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ వినోద్ తెలిపారు. మార్చి1 లోపు విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. రూ. 51 వేల విలువ చేసే ఆధునిక వెయిట్‌లెస్ కృత్రిమ కాలిని మార్చి రెండో వారంలో అందిస్తామన్నారు. 8639081464, 9110353497, 08554-232380 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఉన్నతి.. ఉత్తిదేనా?



- పెండింగ్‌లో ప్రమోషన్ల ప్రక్రియ
- ఉద్యోగుల ఎదురుచూపులు
- ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని నిట్టూర్పు

అనంతపురం అర్బన్: ఉద్యోగులు తమ సర్వీసులో కోరుకునే అత్యంత ప్రాధాన్యతాంశం పదోన్నతి. తమకు ఉద్యోగోన్నతి కల్పించాలంటూ అధికారులకు పదేపదే విన్నవించుకుంటుంటారు. కోర్టులు, కేసులు అంటూ ప్రభుత్వాలు, ఉన్నతాధికారులపై చట్టపరంగా కూడా పోరాటం సాగిస్తుంటారు. అయితే, పదోన్నతుల కల్పనలో శాఖా పరంగా సైతం ఆలస్యం జరుగుతుండటం, పట్టించుకోవాల్సిన ఉన్నతాధికారులు అలసత్వ ధోరణి ప్రదర్శిస్తుండటంతో ఉత్సాహం సన్నగిల్లి జిల్లా రెవెన్యూ ఉద్యోగులు నిరాశ నిస్పృహలతో విధులు నిర్వర్తిస్తున్నారు. పదోన్నతుల కల్పన కలగా మారిందంటూ నిట్టూరుస్తున్నారు. ఎప్పుడు కరుణిస్తారా అంటూ చకోర పక్షుల్లా ఎదురుచూస్తున్నారు. వివిధ కేడర్లలో పోస్టులు ఖాళీగా ఉన్నా, పదోన్నతికి అర్హత సాధించిన వారు వేయికళ్లతో చూస్తున్నా తీవ్ర జాప్యం జరుగుతుండటం గమనార్హం.

ఆవేదన వర్ణనాతీతం..

రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్ల(జేఏ)కు సీనియర్ అసిస్టెంట్‌లుగా పదోన్నతి కల్పిస్తారు. ఈ క్రమంలో జేఏలు తప్పనిసరిగా సర్వే, డిపార్ట్‌మెంటల్ తదితర రెవెన్యూ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ఉండాలి. అలా అన్ని టెస్టులు పాసై పదోన్నతికి అర్హత సాధించిన జేఏలు జిల్లాలో 12 మంది ఉన్నారు. ఇక రెవెన్యూ శాఖలో జిల్లాలో 32 సీనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అర్హులైన వీఆర్‌ఓలకు ఎస్‌ఏలుగానూ పదోన్నతి కల్పిస్తారు. మొత్తం ఖాళీల్లో వీఆర్‌ఓలు, జేఏలకు 40-60 నిష్పత్తిలో పదోన్నతి కల్పించాల్సి ఉంది. అయితే, వీఆర్‌ఓలకు ఇప్పటికే పదోన్నతి కల్పించి, తమ విషయంలో మాత్రం తీవ్ర జాప్యం చేస్తుండటంతో జేఏల ఆవేదన వర్ణనాతీతంగా మారింది.

డీటీల ప్రమోషన్లలోనూ జాప్యం..

ఎస్‌ఏలకు డీటీలుగా పదోన్నతి కల్పించే అంశంలో కూడా తీవ్ర జాప్యం నెలకొంటోంది. ప్రస్తుతం డీటీలుగా పదోన్నతి పొందేందుకు అన్ని అర్హతలూ ఉన్న ఎస్‌ఏలు 15 మంది ఉన్నారు. అయితే ఈ ప్రక్రియ నెలలుగా ముందుకు సాగకపోవడంతో ఎదురు చూపులు తప్పడం లేదు. గ్రూప్-2 ద్వారా పీబీడీటీలు (ప్రొబేషనరీ డిప్యూటీ తహసీల్దార్లు) వస్తారేమోనసే తలంపుతో రెగ్యులర్ పదోన్నతుల ప్రక్రియపై అధికారులు జాప్యం చేస్తున్నట్లు తెలిసింది. కాగా, పీబీడీటీలు వచ్చినా పోస్టుల విషయంలో ఎలాంటి ఇబ్బంది ఉండదని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. జిల్లాకు కేటాయించే పీబీడీటీలు ఏడాది పాటు శిక్షణలో ఉంటారని, అటు తరువాత ప్రభుత్వం సూపర్‌న్యూమరరీ పోస్టులను మంజూరు చేస్తుందని తెలిసింది. ఒకవేళ ప్రభుత్వం ఆ పోస్టులు మంజూరు చేయకపోయినా ఇబ్బందేమీ రాదని, రెగ్యులర్ డీటీలను సీఎస్‌డీటీలుగా నియమించి, వారి స్థానంలో పీడీడీటీలను నియమించవచ్చని చెబుతున్నారు. ఇప్పటికైనా ఈ విషయంపై ఉన్నతాధికారులు దృష్టి సారించి తమకు సాంత్వన చేకూర్చాలని వేడుకుంటున్నారు.

రెవెన్యూ శాఖలో ఖాళీలిలా..	
జూనియర్ అసిస్టెంట్	9
సీనియర్ అసిస్టెంట్	32
డిప్యూటీ తహసీల్దార్	17
పౌర సరఫరాల డీటీలు	26

చర్యలు తీసుకుంటాం..



రెవెన్యూ శాఖలో పదోన్నతులు కల్పించేందుకు చర్యలు చేపట్టాం. సీనియర్ అసిస్టెంట్ నుంచి డిప్యూటీ తహసీల్దారు పదోన్నతులకు ప్యానల్ ఇచ్చాం. **అభ్యంతరాలు రావాల్సి** ఉంది. వీఆర్‌ఓ నుంచి ఎస్‌ఏ ప్రమోషన్‌కు సంబంధించి కోర్టు కేసు ఉంటే దానికి కౌంటర్ వేశాం. జూనియర్ అసిస్టెంట్ నుంచి సీనియర్ అసిస్టెంట్ పదోన్నతి ప్రక్రియను చేపడతాం.

– వి.వినోద్‌కుమార్, కలెక్టర్

'వాసుకి'పై విహారం.. ఆదిదంపతుల అనుగ్రహం



తాడిపత్రి రూరల్: బుగ్గ రామలింగేశ్వరస్వామి దేవాలయంలో మహా శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారు పార్వతీదేవి సమేతంగా వాసుకి వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ముందుగా బుగ్గ ఆలయంలో మూల విరాట్‌లకు అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను విశేషంగా అలకరించి వాసుకి వాహనంపై పుర వీధుల్లో ఊరేగించారు. భక్తులు టెంకాయలు కొట్టి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

నేడు గ్రూప్-2 మెయిన్స్

అనంతపుర అర్బన్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్‌సీ) ఆధ్వర్యంలో గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష ఆదివారం జరగనుంది. 14 కేంద్రాల్లో జరగనున్న పరీక్షకు 7,293 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు కో-ఆర్డినేటింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ నేతృత్వంలో 14 మంది లైజనింగ్ అధికారులు, చీఫ్ సూపరింటిండెంట్లు, ఇతర సిబ్బంది పనిచేస్తున్నారు.

గంట ముందే చేరుకోవాలి..

పరీక్ష సమయానికి గంట ముందే అభ్యర్థులు కేంద్రాలకు చేరుకోవాలి. పేపర్-1 ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, పేపర్-2 మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతుంది. ఉదయం పరీక్షకు 9.45 గంటల తరువాత, మధ్యాహ్నం పరీక్షకు 2.45 తరువాత అభ్యర్థులను కేంద్రంలోకి అనుమతించరు.

భారీగా ఇం'ధనం'

- పెరిగిన పెట్రోలు, డీజిల్ వినియోగం
- నెలకు ఒక్క పెట్రోలు ఖర్చే రూ.129.23 కోట్లు
- ఇప్పటికీ పుంజుకోని ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో పెట్రోలు, డీజిల్ వినియోగం ఏటికేటికీ భారీగా పెరుగుతున్నట్టు తెలుస్తోంది. దశాబ్ద కాలంలో అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో వాహనాల సంఖ్య అమాంతం పెరిగింది. గడిచిన నాలుగైదేళ్లలో ఆటోలు, కార్ల అమ్మకాలు భారీగా పెరిగాయి. దీంతో పెట్రోలు, డీజిల్ వినియోగం గరిష్ట స్థాయికి చేరుకుంది. వచ్చే వేసవిలో మరింతగా ఎగబాకే అవకాశం కనిపిస్తోంది.

రోజుకు రూ.4.30 కోట్లు..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో రోజుకు పెట్రోలు వ్యయం రూ.4,30,78,992 అవుతున్నట్లు తాజా గణాంకాలను బట్టి తెలుస్తోంది. ఇందులో కార్లు, ఆటోల వినియోగం ఎక్కువగా ఉంది. 40 శాతం పెట్రోలు వ్యయం ద్విచక్రవాహనాలకు అవుతున్నట్టు తెలుస్తోంది. ప్రతి ఏటా ద్విచక్రవాహనాల సంఖ్య 6 శాతం పెరుగుతోంది. ఈ క్రమంలో కాలుష్యం పతాక స్థాయికి చేరుతోంది. కాలం చెల్లిన వాహనాలను వాడుతుండటంతో పెట్రోలు వినియోగం అధికమై కాలుష్యం రెండింతలు పెరుగుతున్నట్టు నిపుణులు చెబుతున్నారు.

ఎలక్ట్రికల్ వాహనాలు పుంజుకుంటేనే..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు పుంజుకుంటే తప్ప పెట్రోలు వినియోగం తగ్గే అవకాశం లేదు. గతంలో ఎలక్ట్రిక్ వాహనం కొనుగోలు చేస్తే పన్ను మినహాయింపు ఉండేది. ఇప్పుడా మినహాయింపును ఎత్తేయడంతో చాలామంది మొగ్గు చూపడం లేదు. ఇప్పుడిప్పుడే కార్లు కూడా ఎలక్ట్రిక్ వాహనాల మార్కెట్‌లోకి వచ్చాయి. వీటికి పవర్ స్టేషన్‌లు తక్కువగా ఉన్నాయని వినియోగదారులు అంటున్నారు. ప్రధానంగా కార్లు, ద్విచక్రవాహనాలు ఎలక్ట్రిక్ మోడ్‌లో వస్తే పెట్రోలు వినియోగం భారీగా తగ్గే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. పెట్రోలు రేట్లు భారీగా పెరుగుతున్నా ప్రత్యామ్నాయం లేకపోవడంతో వినియోగదారులు భరించాల్సి వస్తోంది.

జిల్లాలో కంపెనీల వారీగా నెలకు పెట్రోల్ వినియోగం (లీటర్లలో)	
ఐఓసీఎల్	33,10,000
బీపీసీఎల్	20,56,000
హెచ్‌పీసీఎల్	23,57,000
మొత్తం	77,23,000
ఈ విలువ	రూ.84,61,31,880
డీజిల్ వినియోగం (లీటర్లలో)	
ఐఓసీఎల్	48,84,000
బీపీసీఎల్	27,00,000
హెచ్‌పీసీఎల్	34,44,000
మొత్తం	1,10,28,000

లైనింగ్‌తో రైతులకు తీరని అన్యాయం

- సర్కారుపై పార్టీలకతీతంగా తిరుగుబాటు
- ఎమ్మెల్యే పరిటాల సునీత నోరుమెదపకపోవడం అన్యాయం
- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



సింగంపల్లి గ్రామంలో రచ్చకట్టపై రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

ఆత్మకూరు: 'హంద్రీ-నీవాలో లైనింగ్ చేస్తే జిల్లా రైతులకు తీవ్ర నష్టం జరుగుతుంది. ఈ రోజు మనం మౌనంగా ఉంటే.. భవిష్యత్తులో మన పిల్లలకు తీరని అన్యాయం చేసిన వారవుతాం' అని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆత్మకూరు మండలంలోని సింగంపల్లి, వై.కొత్తపల్లి, పంపనూరు, తలుపూరు గ్రామాల్లో రచ్చకట్టల వద్ద సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ హంద్రీ-నీవా కాలువలో ప్లాస్టింగ్ చేస్తే చుక్క నీరు కూడా భూమి లోపలికి ఇంకదనే విషయం సీఎం చంద్రబాబుకు తెలియదా అని ప్రశ్నించారు. రాప్తాడు నియోజకవర్గంలో హంద్రీ-నీవా కాలువ దాదాపు వంద కిలోమీటర్ల మేర పారుతోందని, లైనింగ్ పనులతో 1.50 లక్షల ఎకరాల ఆయకట్టు రైతులు దెబ్బతింటారన్నారు. కుప్పానికి నీరు తీసుకెళ్లాలన్న తొందరలో లైనింగ్‌కు తెరలేపారన్నారు. ఇప్పటికీ శ్రీశైలంలో 80 టీఎంసీల నీరు ఉన్నాయని, మరో ఐదు నెలలు హంద్రీ-నీవా కాలువలో నీరు పారించే అవకాశమున్నా, నీటిని ఆపి మరీ పనులు చేయాలనుకోవడం దౌర్భాగ్యమన్నారు. ఓ టీడీపీ నాయకుడే ఇటీవల ప్రభుత్వ తీరుపై వీడియో ద్వారా ఆవేదన వ్యక్తం చేశాడని, దీన్ని బట్టి పరిస్థితి ఎంత ఘోరంగా ఉండబోతోందో అర్థం చేసుకోవచ్చన్నారు. ముందు పేరూరు డ్యాంకు నీరు వదలాలని డిమాండ్ చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం జగనన్న కుప్పానికి నీటిని తరలించేందుకు అన్నమయ్య జిల్లా రాయచోటి నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు శ్రీకారం చుట్టిన విషయాన్ని గుర్తు చేశారు. అప్పట్లోనే చిత్తూరు జిల్లాలోని హంద్రీ-నీవా కాలువకు లింక్ కాలువ ఏర్పాటు చేశారని, రూ.3 వేల కోట్ల పనుల్లో దాదాపు రూ.1,500 కోట్ల పనులు పూర్తయినట్లు వెల్లడించారు. ఆ పనులు చేపట్టకుండా లైనింగ్ చేస్తామనడం అన్యాయమన్నారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే పరిటాల సునీత నోరు మెదపకపోవడం దుర్మార్గమన్నారు.

వైఎస్సార్ చలువతోనే నీరు..

హంద్రీ-నీవా కాలువ దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి పుణ్యమేనని, ఆయన చలువతో రైతులు తమ పొలాల్లో బోర్లు వేయించుకొని, పంటలు పండించుకుంటున్నారని ప్రకాష్ రెడ్డి తెలిపారు. మహానేత ఆశయాన్ని నీరు గార్చేలా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వంపై పార్టీలకతీతంగా నేడు ఉద్యమిస్తున్నారన్నారు. రైతులను కాదని లైనింగ్ పనులు చేస్తే అందరం కలసి అడ్డుకుంటామని, అందులో తాను ముందుంటానని హెచ్చరించారు. తన పాదయాత్రకు పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో హైకోర్టుకు వెళ్లామని, త్వరలోనే యాత్ర చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

'దిశ'కు దిక్కు లేదాయె!

- కూటమి ప్రభుత్వం వచ్చాక కేవలం ఒకసారి నిర్వహణ
- ఎంపీలు, కలెక్టర్లకు పట్టని వైనం



అనంతపురం సిటీ: కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక జిల్లా సమన్వయ, అభివృద్ధి కమిటీ(దిశ) సమావేశాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. దిశ కమిటీకి ఆయా పార్లమెంట్ సభ్యుడు (ఎంపీ) చైర్మన్‌గా వ్యవహరిస్తారు. కలెక్టర్ మెంబర్ సెక్రటరీగా ఉంటారు. ఎంపీ అధ్యక్షతన ప్రతి మూడు నెలలకోసారి 'దిశ' సమావేశాలు జరగాలని చట్టం చెబుతున్నా రెండు జిల్లాల్లోనూ అతీగతీ లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక అనంతపురం జిల్లాకు సంబంధించి గత ఏడాది అక్టోబర్ 29న 'దిశ' సమావేశం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. శ్రీసత్యసాయి జిల్లాకు సంబంధించి హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి అధ్యక్షతన డిసెంబర్ 31న సమావేశం జరిగింది. ఆ తరువాత ఇప్పటి వరకు సమావేశాలు నిర్వహించిన పాపాన పోలేదు.

కొరవడిన సమన్వయం...

ఎంపీలు, కలెక్టర్లు కూర్చొని మాట్లాడాక సమావేశం ఎప్పుడు నిర్వహించేది ప్రకటించాల్సి ఉంది. ఆ తరువాత ఉమ్మడి జిల్లా పరిషత్ అధికారులు అజెండా రూపొందించి అన్ని శాఖల అధికారులతో పాటు సభ్యులకు తెలియజేస్తారు. ఇంతటి ప్రాధాన్యం కలిగిన సమావేశాల నిర్వహణను అటు కలెక్టర్లు, ఇటు ఎంపీలు ఇద్దరూ గాలికొదిలేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కలెక్టర్లు, ఎంపీల మధ్య సమన్వయం కొరవడటం వల్లే నిర్వహించడం లేదని తెలుస్తోంది. జెడ్పీ అధికారులు మాత్రం పార్లమెంట్, శాసనసభ సమావేశాల కారణంగా సమావేశాల నిర్వహణలో జాప్యం జరుగుతోందని చెప్పుకొంటూ వస్తున్నారు. ఎంపీలు, కలెక్టర్ల అభిప్రాయాల కోసం నోట్ ఫైల్ సిద్ధం చేసి కాళ్లరిగేలా తిరుగుతున్నా తమకు ఎప్పుడు వీలవుతుందో చెప్పడానికి కూడా వారు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది.

సమస్యల తాండవం..

కీలకమైన జిల్లా సమన్వయ, అభివృద్ధి కమిటీ సమావేశాలు జరగకపోవడంతో సమస్యలు విలయతాండవం చేస్తున్నాయి. అటు శ్రీసత్యసాయి, ఇటు అనంతపురం జిల్లాలో ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ముఖ్యంగా వేసవి వచ్చేస్తోంది. గ్రామాల్లో తాగునీటి సమస్య అప్పుడే చుక్కలు చూపిస్తోంది. మరోవైపు పంట ఉత్పత్తులకు గిటుబాటు ధరల్లేక రైతులు అల్లాడిపోతున్నారు. విద్యుత్ కోతలతో విసుగెత్తిపోతున్నారు. ఇలా అనేక సమస్యలు రాజ్యమేలుతున్నాయి. వాటిపై సమగ్రంగా చర్చించి, పరిష్కారానికి చొరవ చూపాల్సిన ఎంపీలు, కలెక్టర్లు ఎవరి బిజీలో వారు ఉండిపోతున్నారు. ఇప్పటికైనా రెండు జిల్లాల ఎంపీలు, కలెక్టర్లు 'దిశ' కమిటీ సమావేశాల నిర్వహణపై దృష్టి సారించి క్రమం తప్పకుండా నిర్వహించేందుకు చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గురుకులాల్లో 5, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలోని అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 2025-26 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని గురుకుల పాఠశాలల ఉమ్మడి జిల్లా సమన్వయకర్త కె.జయలక్ష్మీ తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. బీఆర్‌ఏజీసెట్-25 ప్రవేశ పరీక్ష ద్వారా (ఇంగ్లిష్ మీడియం) ఎంపిక చేస్తామని వెల్లడించారు. మార్చి 6లోగా https:// apbragcet. apcfss. in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 5వ తరగతి ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 6వ తేదీన ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఇంటర్ ప్రవేశ పరీక్ష అదేరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు ఉంటుందన్నారు.

అనంతపురం జిల్లాలో పాఠశాలల వారీగా సీట్ల వివరాలు...		
స్కూల్	5వ తరగతి సీట్లు	ఇంటర్ సీట్లు
కురుగుంట (బాలికలు)	80	సీఈసీ 80
తిమ్మాపురం (బాలికలు)	80	ఎంపీసీ,బైపీసీ 80
కణేకల్లు (బాలురు)	80	ఎంపీసీ-బైపీసీ 80
ఉరవకొండ (బాలికలు)	80	ఎంఈసీ,సీఈసీ 80
బి.పప్పూరు (బాలురు)	80	ఎంపీసీ,బైపీసీ 80
కురుగుంట జూనియర్ కళాశాల	--	ఎంపీసీ,బైపీసీ 160
గుత్తి (బాలికలు)	80	ఎంపీసీ,బైపీసీ 80
బ్రహ్మసముద్రం (బాలికలు)	80	సీఈసీ,హెచ్ఈసీ 80
కొర్రపాడు (బాలికలు)	80	------------
మొత్తం	640	720

శ్రీ సత్యసాయి జిల్లాలో పాఠశాలల వారీగా సీట్ల వివరాలు...		
స్కూల్	5వ తరగతి సీట్లు	ఇంటర్ సీట్లు
కాళసముద్రం (బాలురు)	80	ఎంపీసీ,బైపీసీ 80
మలుగూరు (బాలురు)	80	ఎంపీసీ,బైపీసీ 80
నల్లమాడ (బాలికలు)	80	సీఈసీ-హెచ్ఈసీ 80
అమరాపురం (బాలికలు)	80	ఎంపీసీ,బైపీసీ 80
హిందూపురం (బాలికలు)	80	ఎంపీసీ,బైపీసీ 80
రొళ్ల (బాలురు)	80	------------
హిందూపురం (బాలురు)	80	------------
మొత్తం	560	400



క్లుప్తంగా

స్థల వివాదంలో ఘర్షణ



చికిత్స పొందుతున్న బాధితులు

ఉరవకొండ(విడపనకల్లు): విడపనకల్లు మండలం హావళిగిలో ఇరువర్గాల మధ్య స్థల విషయమై ఘర్షణ జరిగింది. వివరాల్లోకెళితే... ఒక వర్గానికి చెందిన మనోహర్, బసమ్మ, వెంకటలక్ష్మి, జ్యోతిల ఇంటి పక్కనే మరో వర్గం బాబు, కృష్ణమ్మలు నివాసముంటున్నారు. కొంత కాలంగా ఇంటి పక్కన ఒక్క అడుగు స్థలం తమదే అంటూ ఇరువర్గాల మధ్య వివాదం రాజుకుంది. పెద్దలు జోక్యం చేసుకొని ఇరువర్గాలకూ సర్దిచెప్పారు. అయితే శనివారం మరోసారి స్థలం కోసం ఇరువర్గాల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో కట్టెలతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఇరువర్గాలకు చెందిన ఆరుగురికి గాయాలు అయ్యాయి. వీరిని ఉరవకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

లింగనిర్ధారణ నిషేధిత చట్టంపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ భ్రమరాంబ దేవి

అనంతపురం మెడికల్: లింగ నిర్ధారణ నిషేధిత చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి పేర్కొన్నారు. శనివారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో ప్రోగ్రాం ఆఫీసర్లతో ఆమె సమావేశమయ్యారు. సినిమా థియేటర్లు, ఆకాశవాణి దినసరి కార్యక్రమ ప్రసారాల్లో విరామం మధ్యలో ఈ చట్టంపై వీడియో, ఆడియో ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని నిర్ణయించారు. పీహెచ్‌సీల పరిధిలోనూ ఆడపిల్లల ప్రాముఖ్యతను తెలియజేసే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ యుగంధర్, డాక్టర్ రవిశంకర్, గైనకాలజిస్టు డాక్టర్ నిస్సార్ బేగం, ప్రభుత్వ సర్వజనాస్పత్రి చిన్న పిల్లల విభాగాధిపతి డాక్టర్ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

బీటెక్, బీబీఏ ఫలితాల విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ (అనంతపురం) బీటెక్ మొదటి సంవత్సరం తొలి సెమిస్టర్ (ఆర్–23 రెగ్యులర్, సప్లిమెంటరీ), సప్లిమెంటరీ (ఆర్–20, 19, 15, 23, 20, 19, 15) పరీక్ష ఫలితాలను డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ నాగప్రసాద్ నాయుడు శనివారం విడుదల చేశారు. అలాగే బీబీఏ మొదటి సంవత్సరం తొలి సెమిస్టర్ (ఆర్–24) ఫలితాలను కూడా ప్రకటించారు.

అగ్గి.. రాజుకుంటే బుగ్గే !

గుమ్మఘట్ట మండలం కొత్తపల్లి కుంట పరిసరాల్లో అగ్గి రాజుకుంటే మంటల్ని అదుపుచేసేందుకు 28 కిలోమీటర్ల దూరంలోని రాయదుర్గం నుంచి ఫైరింజన్ రావాల్సి ఉంటుంది. అదే సమయంలో బొమ్మనహాళ్ మండలం ఏళంజిలో మంటలు చెలరేగితే అక్కడి నుంచి 100 కిలోమీటర్ల ప్రయాణం చేయాల్సి వస్తోంది. ఈ మధ్య ఎంత తక్కువన్నా 3 గంటల సమయం పట్టే అవకాశం ఉంది. దీంతో ఎంతటి విలువైన ఆస్తి అయినా సరే బుడిద కాక తప్పదు. ఇలా ఈ ప్రాంతంలో ఒక్కటే కాదు జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ ఈ సమస్య కనిపిస్తోంది. పరిధికి తగ్గ ఫైరింజన్లు లేకపోవడమే నష్టానికి కారణంగా కనిపిస్తోంది.

- పరిధి ఎక్కువ .. ఫైరింజన్లు తక్కువ
- ప్రతిపాదనల్లోనే కొత్త ఫైర్ స్టేషన్‌లు
- అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ



అనంతపురం సమీపాన మంటలను అదుపుచేస్తున్న ఫైర్ సిబ్బంది

రాయదుర్గం: భానుడు ఫిబ్రవరిలోనే నిప్పులు కక్కుతున్నాడు. ఎండల ధాటికి చెట్లన్నీ మోడువారి ఆకులన్నీ నేలరాలుతున్నాయి. ఈ పరిస్థితుల్లో అగ్గి రాజుకుంటే ఆపద తప్పేలా లేదు. వచ్చే మూడు, నాలుగు నెలలు జిల్లాలో నిప్పుల కొలిమి చూడాల్సి వస్తోంది. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ, అనంతపురం, తాడిపత్రి, గుంతకల్లు నియోజకవర్గాల్లో అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయి. అయితే పరిధి ఎక్కువ.. వాహనాలు తక్కువ అన్నట్టు ఉంటున్నాయి. అగ్నిమాపక కేంద్రాల్లోనూ కనీస సౌకర్యాలు కొరవడ్డాయి. సిబ్బంది కొరత ఇతర కారణాలు వెరసి అగ్గి రాజుకుంటే బుగ్గి కాక తప్పదు. జిల్లాలో దాదాపు 25 లక్షల జనాభా ఉంది. ప్రతి 50 వేల మంది జనాభాకు ఒక ఫైరింజన్ ఉండాలి. ఈ లెక్కన జిల్లాకు 50 వాహనాలు అవసరం. అయితే అనంతపురం, గుంతకల్లు నియోజకవర్గాల్లో రెండు, కర్ణాటక సరిహద్దునున్న రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ, తాడిపత్రి నియోజకవర్గాల్లో ఒక్కొక్కటి చొప్పున మొత్తం ఎనిమిది వాహనాలు మాత్రమే ఉన్నాయి. దీంతో అగ్ని ప్రమాదాలను సకాలంలో అరికట్టేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జిల్లాలో మండలానికి ఒక కొత్త అగ్నిమాపక కేంద్రం (ఫైర్ స్టేషన్) ఏర్పాటుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతిపాదనలు పంపారు. ఎన్నికలు రావడం.. ఆ తర్వాత కూటమి సర్కార్ కొలువుదీరడంతో ప్రక్రియ ఆగిపోయింది. ఇక ఫైర్ స్టేషన్లలో నీటి కొరత వేధిస్తోంది. అత్యవసర పరిస్థితుల్లో మున్సిపల్ వాటర్ లేదా ఇతర వ్యవసాయ బోర్లను ఆశ్రయించాల్సి వస్తోంది.

అగ్ని ప్రమాదాలు ఎక్కడ ఎక్కువంటే..

జిల్లాలోని కర్ణాటక సరిహద్దునున్న రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ ప్రాంతాల్లోనే ఎక్కువగా అగ్ని ప్రమాదాలు సంభవిస్తుంటాయి. గత వేసవిలో రాయదుర్గంలోని డంపింగ్‌యార్డుకు నిప్పంటుకుంది. ఒక్క ఫైరింజన్‌తో మంటలు అదుపు చేయడం కష్టమైంది. కళ్యాణదుర్గం, ఉరవకొండ నుంచి మరో రెండు రప్పించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో గత్యంతరం లేక కర్ణాటక రాష్ట్రం బళ్లారి, మొలకాల్మూరు, చెళ్లకెర ప్రాంతాల నుంచి మరో నాలుగు రప్పించి మంటలను అదుపు చేయాల్సి వచ్చింది. దీనికితోడు కొందరు ఎండాకాలంలో చేసే నిర్లక్ష్యానికి భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. సిగరెట్/ బీడీ కాల్చి ఆర్పకుండా పడేయడం, కంపోస్టు యార్డుల్లో మంటలు ఎగసిపడటం, విద్యుత్ షార్ట్ సర్క్యూట్, గ్యాస్‌స్టౌ లీకేజీ వంటివి మధ్యస్థ ప్రమాదాలుగా పరిగణిస్తారు. పరిశ్రమలు, పెద్ద భవనాల్లో జరిగేవి పెద్ద ప్రమాదాలుగా గుర్తిస్తారు. నీటిలో మునిగి పోవడం, ప్రమాదాల్లో చిక్కుకోవడం, రోడ్డు ప్రమాదాలు వంటి సంఘటనలను తీవ్రమైనవిగా పరిగణిస్తారు. అప్రమత్తంగా ఉంటేనే ప్రమాదాల నివారణ సాధ్యమని అధికారులు చెబుతున్నారు.

ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు



వేసవిలో అగ్ని ప్రమాదాలు అరికట్టేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. విస్తృత స్థాయిలో ప్రజల్లో చైతన్యం పెంపొందిస్తున్నాం. ప్రమాదాలకు అడ్డుకట్ట వేస్తున్నాం. ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గిస్తాం. అగ్గి రేగకుండా ఇంట్లో, బయట ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలి. అన్ని ఫైర్ స్టేషన్లలోనూ నీటి వసతి అందుబాటులో ఉంచాం. తగిన సిబ్బంది కూడా ఉన్నారు. వాహనాల సంఖ్య తక్కువగా ఉండడంతో తీవ్రతను బట్టి పక్క నియోజకవర్గాల్లోని వాహనాలను రప్పించి మంటలను అదుపు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. – శ్రీనివాసరెడ్డి, జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి, అనంతపురం

4 నుంచి గవిమఠం బ్రహ్మోత్సవాలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మఠం పీఠాధిపతులు, సహాయ కమిషనర్, సిబ్బంది

ఉరవకొండ: తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధిగాంచిన ఉరవకొండ గవిమఠం చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మార్చి నాలుగో తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. కర్ణాటకలోని తుమకూరులోని పీఠాధిపతుల వారి శాఖ మఠంలో మఠం 8వ పీఠాధిపతులు జగద్గురు చెన్నబసవరాజేంద్రస్వామి చేతుల మీదుగా శనివారం బ్రహ్మోత్సవాల పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆదోని చౌకి మఠం పీఠాధిపతులు కళ్యాణ స్వామిజీ, గవిమఠం సహాయ కమిషనర్ రాణి, ఏజెంట్ రాజన్నగౌడ్, మఠం జూనియర్ అసిస్టెంట్ గోపాలకృష్ణ, నారాయణస్వామి, గోపిల సమక్షంలో పీఠాధిపతులను ఘనంగా సత్కరించారు. మఠం సహాయ కమిషనర్ రాణి మాట్లాడుతూ మార్చి 4 నుంచి 11వ తేదీ వరకు చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. మార్చి 7న పీఠాధిపతుల వారి అడ్డపల్లకీ ఉత్సవం, 9న బ్రహ్మరథోత్సవం జరుగుతాయన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కల్గకుండా అన్ని వసతులు కల్పిస్తామన్నారు.

ఆన్‌లైన్ మోసం బట్టబయలు



పార్సిల్‌లో వచ్చిన గుడ్డముక్కలు

అనంతపురం: సోములదొడ్డికి చెందిన ఎం.ప్రతాప్‌రెడ్డి ఆన్‌లైన్‌లో మూడు షర్టులకు ఆర్డర్ పెట్టాడు. శనివారం కొరియర్‌లో పార్సిల్ వచ్చింది. దాన్ని తెరిచి చూడగా మసిబట్ట, చిరిగిపోయిన గుడ్డ ముక్క కనిపించింది. కొరియర్ బాయ్‌ను అడిగితే తమకు వచ్చిన పార్సిల్ తీసుకొచ్చి ఇచ్చామని సమాధానమిచ్చారు. దీంతో బాధితుడు ఆన్‌లైన్ మోసంపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

8న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్

అనంతపురం: జిల్లాలో మార్చి 8న జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహిస్తామని ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్ అన్నారు. జిల్లా కోర్టులో శనివారం కలెక్టర్ వినోద్‌కుమార్, ఉమ్మడి జిల్లాల ఎస్పీలు పి. జగదీష్, వి. రత్నతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేసేందుకు అధికారులు, పోలీసులు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. గత ఏడాది డిసెంబర్ 14న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారంలో రాష్ట్రంలోనే అనంతపురం జిల్లా 9వ స్థానంలో నిలిచిందన్నారు. ఈ సారి ఆ స్థానాన్ని మెరుగుపరచాలని కోరారు. జాతీయ లోక్ అదాలత్‌ను దృష్టిలో ఉంచుకుని అన్ని పోలీస్‌స్టేషన్లలో కొత్త కేసులను రిజిస్టర్ చేయరాదని సూచించారు. ఉన్న కేసులు మాత్రమే పెట్టాలన్నారు. కోర్టుల నుంచి వచ్చే ఎండార్స్‌మెంట్‌లను అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ల నుంచి వెంటనే తెప్పించుకుని చూడాలన్నారు. బెయిలబుల్ వారెంట్స్, విచారణ ఖైదీల కేసుల త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జిల్లాలో జాతీయ స్థాయి వర్క్‌షాపు నిర్వహిస్తామని, కార్యక్రమానికి సుప్రీం కోర్టు జడ్జిలు, హైకోర్టు చీఫ్ జస్టిస్ హాజరవుతారన్నారు. ఉమెన్ ట్రాఫికింగ్, చైల్డ్ మిస్సింగ్, తదితర అంశాలపై సదస్సు జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో ఎంత మంది మహిళలు, చిన్నారులు మిస్ అయ్యారు అనే అంశంపై ప్రత్యేక దృష్టి సారించి తమకు రిపోర్టులు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పోక్సో కోర్టు జడ్జి రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మే 10న 'భారత రాజ్యాంగం'పై పరీక్ష

- వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్లు

అనంతపురం అగ్రికల్చర్: భారత రాజ్యాంగంపై జరిగే పరీక్షపై ఆసక్తి కలిగిన విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఇలా ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని అన్‌హిలేషన్ ఆఫ్ క్యాస్ట్ ఫ్యూజన్ (ఏసీఎఫ్) అసోసియేషన్ జిల్లా కో ఆర్డినేటర్, హైకోర్టు అడ్వకేట్ సి.మహేశ్వరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత రాజ్యాంగం సాధించిన ప్రగతి– అమలు తీరు, బహుజన వారియర్స్ జీవిత చరిత్రలు, బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచనలు, ప్రసంగాలు అనే అంశంపై మే 10న గుంటూరులో పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. 150 మార్కులకు ఆబ్జెక్టివ్ టైప్, మల్టిపుల్ చాయిస్ విధానంలో పరీక్ష ఉంటుందని తెలిపారు. ప్రతిభ కనబరిచిన వారికి మొదటి బహుమతి కింద రూ.లక్ష, రెండో బహుమతి రూ.75 వేలు, మూడవ బహుమతి రూ.50 వేలు, నాలుగో బహుమతి కింద రూ.25 వేల నగదు పురస్కారం ఉంటుందని వివరించారు. పరీక్షలో మెరిట్ సాధించిన మొదటి 100 మంది అభ్యర్థులను 'మీలో ఎవరు బహుజన్' పేరిట జరిగే టీవీ షోలో పాల్గొనే అవకాశం కల్పిస్తామని తెలిపారు. అందులో ఇదే సిలబస్‌పై 10 ప్రశ్నలకు జరిగే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ రూ.లక్ష గెలుచుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. పరీక్షకు హాజరు కావాలనుకునే వారు www.acfassociation.com అనే వెబ్‌సైట్‌లో ఏప్రిల్ 30లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 70326 86204 నంబరులో సంప్రదించాలన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

- బావిలో దూకిన విద్యార్థి
- ఐదు నిమిషాల్లో గల్లంతు
- ఏడు గంటల తర్వాత మృతదేహం వెలికితీత



బావిలో గాలిస్తున్న ఫైర్ అండ్ సేఫ్టీ సిబ్బంది (ఇన్‌సెట్‌లో) మృతుడు వీరాచారి (ఫైల్)

గుత్తి: ఈత సరదా విద్యార్థి ప్రాణం తీసింది. తల్లిదండ్రులకు తీరని గర్భశోకం మిగిల్చింది. వివరాల్లోకెళితే... గుత్తిలోని ఆచార్య కాలనీకి చెందిన కార్పెంటర్ వేణుగోపాల్, రాజమ్మ దంపతుల కుమారుడు వీరాచారి (15) కోటలోని ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. వీరాచారి స్నేహితులు మనోజ్, దేవేంద్ర, సుధీర్, రహీంతో కలిసి శనివారం కొండమీద లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వద్దకు వెళ్లి అక్కడ భోజనాలు చేశారు. అనంతరం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో రాజా బావి వద్దకు వెళ్లారు. వీరాచారి ఈత రాకపోయినా తక్కువ లోతు ఉంటుందని భావించి సరదాగా ఈత కొడతానని చెప్పి బావిలోకి దూకాడు. ఐదు నిమిషాల వ్యవధిలో గల్లంతయ్యాడు. మిగిలిన స్నేహితులు అతడిని కాపాడేందుకు ప్రయత్నించినా ప్రయోజనం లేకపోయింది. రాజాబావి చాలా పెద్దది. దాదాపు 50 అడుగుల లోతు నీళ్లున్నాయి. అదీకాక పక్కనే మరో బావి ఉండడంతో వీరాచారి చిన్న బావిలోకి వెళ్లి ఉండవచ్చని భావించారు. ఈలోపు స్థానిక యువకులతో పాటు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ సురేష్, ఏఎస్‌ఐ నాగమాణిక్యం, పోలీసులు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు సంఘటన స్థలానికి చేరుకుని వీరాచారి కోసం బావిలో గాలింపు చర్యలు చేపట్టారు. కుమారుడి కోసం తండ్రి వేణుగోపాల్ తనకు ఈత రాకపోయినా బావిలో దూకేందుకు ప్రయత్నించగా స్థానికులు వారించారు. అనంతరం గుంతకల్లుకు చెందిన ఫైర్ అండ్ సేఫ్టీ సిబ్బంది, గజ ఈతగాళ్లు ఏడుగంటలు శ్రమించి వీరాచారిని బయటకు తీశారు. అయితే అప్పటికే అతనిలో చలనం లేదు. మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దేవుడా ఎంత పనిచేశావయ్యా అంటూ కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

ఎలుగుబంటి గాండ్రింపుతో భయాందోళన

కుందుర్పి: మండల కేంద్రం కుందుర్పిలోని జూనియర్ కళాశాల, బొమ్మలనాయుడి దేవస్థానం పరిసర ప్రాంతంలో రాత్రిపూట ఓ ఎలుగుబంటి గాండ్రింపు.. అరుపులతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. అనారోగ్యంతో అరుస్తోందా.. లేక ఎదకు వచ్చి గాండ్రిస్తోందా తెలియడం లేదని అంటున్నారు. చీకటి పడితే చాలు బొమ్మలనాయుడి ఆలయంలో ఉన్న శివస్వాములు బిక్కుబిక్కుమంటున్నారు. మరోపక్క అల్లాపురం వెళ్లేవారు చీకటి పడితే అప్పిలేపల్లి మీదుగా అల్లాపురం చేరుకుంటున్నట్లు పైగ్రామప్రజలు తెలిపారు. అటవీశాఖ అధికారులు ఇకనైనా స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

నేటి నుంచి 'ఇంటింటి చెత్త సేకరణ'

అనంతపురం రూరల్/ పెద్దవడుగూరు: స్వచ్ఛ సంకల్పంలో భాగంగా ఆదివారం నుంచి రెండురోజుల పాటు జిల్లాలో ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) నాగరాజునాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 575 గ్రామ పంచాయతీల్లో ఇంటింటి చెత్త సేకరణ జరుగుతుందన్నారు. పరిసరాల పరిశుభ్రత, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడం వల్ల కలిగే అనర్థాల పై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఇదిలా ఉండగా పెద్దపప్పూరు మండలంలో డీపీఓ పర్యటించి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

నేడు రాష్ట్రస్థాయి రాతిదూలం పోటీలు

గార్లదిన్నె: కోటంక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి తిరునాలలో భాగంగా నాల్గవ ఆదివారం రాష్ట్రస్థాయి రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. శనివారం వారు మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనే వారు రూ.500 ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. గెలుపొందిన వృషభాల యజమానికి మొదటి బహుమతిగా రూ.50వేలు, రెండవ బహుమతిగా రూ.40 వేలు, మూడవ బహుమతిగా రూ.30 వేలు, నాల్గవ బహుమతిగా రూ.20 వేలు, ఐదవ బహుమతిగా రూ.10వేలు, ఆరవ బహుమతిగా రూ.5 వేలు అందజేయనున్నట్లు వెల్లడించారు.

రాతిదూలం విజేత రాయవరం వృషభాలు

గార్లదిన్నె: కల్లూరులో సింగర్ప తిరునాలలో భాగంగా శనివారం గ్రామపంచాయతీ ప్రజల ఆధ్వర్యంలో నిర్వహించిన రాతిదూలం లాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. 14 జతల ఎద్దులు పాల్గొన్నాయి. ఇందులో కర్నూలు జిల్లా రాయవరానికి చెందిన అక్షరరెడ్డి వృషభాలు ప్రథమస్థానంలో నిలిచాయి. నంద్యాల జిల్లా బీరం బుల్స్‌కు చెందిన సుబ్రహ్మణ్యేశ్వర రెడ్డి బృషభాలు ద్వితీయ, పెద్ద కొట్టాలకు చెందిన నారాయణరెడ్డి వృషభాలు తృతీయ, సోమయాజుల పల్లెకు చెందిన నరసయ్య వృషభాలు నాలుగో స్థానంలో నిలిచాయి. ఐదో స్థానంలో కర్నూలు జిల్లా శివకుమార్ వృషభాలు, ఆరో స్థానంలో అనంతపురం జిల్లా కాశేపల్లి జయచంద్రారెడ్డి వృషభాలు, ఏడో స్థానంలో నంద్యాల జిల్లా ఉంగరానిగుండ్ల మాదయ్య వృషభాలు, ఎనిమిదో స్థానంలో బేతంచెర్ల భానూజ వృషభాలు, తొమ్మిదో స్థానంలో అనంతపురం జిల్లా యాలేరు మురళీ శ్రీధర్‌రెడ్డి వృషభాలు గెలుపొందాయి. విజేత వృషభాల యజమానులకు మొదటి బహుమతిగా రూ.40 వేలు, రెండవ బహుమతిగా రూ.30 వేలు, మూడవ బహుమతిగా రూ.20 వేలు, నాల్గవ బహుమతిగా రూ.15వేలు, ఐదవ బహుమతిగా రూ.12వేలు, ఆరవ బహుమతిగా రూ.10 వేలు, ఏడవ బహుమతిగా రూ.8వేలు, ఎనిమిదవ బహుమతిగా రూ.6వేలు, తొమ్మిదవ బహుమతిగా రూ.5వేల నగదు అందజేశారు.

పీఆర్‌సీ తక్షణమే అమలు చేయండి

గుంతకల్లు: పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీ తక్షణమే అమలు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గొని పాతిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం గుంతకల్లుకు విచ్చేసిన ఆయన ఏపీటీఎఫ్ నాయకులుతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌ఆర్‌ఏ, సరెండర్ లీవ్, ఏపీజీఎల్‌ఐ, ప్రావిడెంట్ ఫండ్ అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఐఆర్ ఇవ్వడంతోపాటు మెరుగైన పీఆర్‌సీ ప్రకటిస్తామని ఏడాది క్రితం హామీ ఇచ్చిన విషయం గుర్తు చేశారు. డీఏ బకాయిలు కూడా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. విశ్రాంత ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక సౌలభ్యాలు కూడా అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు నరేష్‌కుమార్, లక్ష్మీప్రసాద్, గంగరాజు, ధనుంజయ, గణేష్‌బాబు, చంద్రశేఖర్, నాగేంద్రప్ప, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

పీ-4 సర్వే తనిఖీ



సర్వేపై స్థానికులతో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 41వ సచివాలయ పరిధిలో ఉన్న వెంకటేశ్వర నగర్‌లో జరుగుతున్న పీ–4 మోడల్ సర్వేను జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ శనివారం పరిశీలించారు. సర్వే ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేశారు. ఆర్థికంగా వెనుకబడిన వారిని గుర్తించేందుకు ఈ సర్వేను ప్రభుత్వం చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తి, వార్డు అడ్మిన్ కార్యదర్శి సరోజ, రెవెన్యూ కార్యదర్శి రోజ తదితరులు ఉన్నారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

రాప్తాడు: అంతర్ జిల్లా దొంగను రాప్తాడు పోలీసులు అరెస్ట్ చేశారు. అతని నుంచి 12 తులాల బంగారు, బంగారు అమ్మి కొన్న కారు, బుల్లెట్, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ శ్రీహర్ష శనివారం పోలీస్ స్టేషన్‌లో మీడియాకు వెల్లడించారు. రాప్తాడులో వాహనాలు తనిఖీ చేస్తుండగా వైఎస్సార్ జిల్లా దువ్వూరు మండలం జిల్లాల గ్రామానికి చెందిన మహమ్మద్ రఫీపై అనుమానం వచ్చి పోలీసులు తమదైన శైలిలో విచారణ చేయడంతో పలు చోరీలు వెలుగుచూశాయి. అనంతరం అతడిని అరెస్ట్ చేశారు. అనంతపురం, నంద్యాల, కర్నూలు, వైఎస్సార్ జిల్లాల్లోని పలు ఇళ్లలో 47 తులాల బంగారు నగలను చోరీ చేసి, బెంగళూరులోని ఓ ప్రైవేట్ గోల్డ్ కంపెనీలో 35 తులాలను విక్రయించాడు. ప్రస్తుతం రఫీ వద్ద ఉన్న 12 తులాలతో పాటు, మిగిలిన 35 తులాల బంగారు నగలు అమ్మి కొనుగోలు చేసిన మారుతి షిఫ్ట్ డిజైర్ కారు, రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్, హోండా స్కూటీ సీజ్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుని పేరు మీద ఇప్పటికే వైఎస్సార్, కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని వివిధ పోలీస్‌స్టేషన్లల్లో 16 చోరీ కేసులు ఉన్నాయి. ఇతని వద్ద నుంచి బంగారు నగలు కొనుగోలు చేసిన అట్టికా గోల్డ్ కంపెనీకి నోటీసులు పంపామని సీఐ తెలిపారు. అంతర్‌జిల్లా దొంగను అరెస్టు చేసిన సీఐ శ్రీహర్షతో పాటు సిబ్బందిని ఎస్పీ జగదీష్, డీఎస్పీ వెంకటేశులు అభినందించారు.

టమాట, మిరప క్రయవిక్రయాలపై దృష్టి



వీడియో కాన్ఫరెన్స్‌లో ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, ఉద్యానశాఖ డీడీ నరసింహారావు

అనంతపురం అగ్రికల్చర్: టమాట, మిరప క్రయవిక్రయాలపై దృష్టి సారించి.. రైతులకు గిట్టుబాటు ధరలు వచ్చేలా చూడాలని ఉద్యానశాఖ కమిషనర్ శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం ఆయన గుంటూరు నుంచి జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతపురం జిల్లాలో ఈ ఖరీఫ్‌లో టమాట పంట 40 వేల ఎకరాల్లోనూ, రబీలో 3 వేల ఎకరాల్లో సాగు చేయగా.. ఎకరాకు 25 టన్నుల వరకు దిగుబడి వచ్చిందని జిల్లా అధికారులు తెలిపారు. అలాగే 40 వేల ఎకరాల్లో ఎండు మిరప సాగులోకి రాగా ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల మేర దిగుబడులు వచ్చాయన్నారు. ఖరీఫ్ మొదట్లో టమాటకు గిట్టుబాటు ధరలు లభించగా, తర్వాత ధరలు తగ్గుముఖం పట్టాయన్నారు. మిరప పరిస్థితి కూడా అలాగే ఉందని తెలిపారు. రైతులు నష్టపోకుండా మార్కెటింగ్ శాఖతో సమన్వయం చేసుకుని పనిచేయాలని ఆదేశించారు. మార్కెటింగ్‌శాఖ ద్వారా కిలో రూ.8 ప్రకారం టమాట సేకరించి ఇతర జిల్లాలకు సరఫరా జరిగేలా చూడాలని తెలిపారు. వచ్చే ఖరీఫ్ నుంచి టమాట, మిరప ఒకే విడతలో అత్యధిక విస్తీర్ణంలో సాగు చేయకుండా విడతల వారీగా సాగు చేసేలా రైతుల్లో అవగాహన కల్పించి ప్రోత్సహించాలని తెలిపారు. ముందస్తు మార్కెట్ పరిస్థితులు అంచనాల ఆధారంగా పంటల సాగు చేసేలా క్షేత్రస్థాయిలో ఉద్యానశాఖ అధికారులు రైతులకు సరైన సూచనలు, సిఫారసులు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ డీడీ బీఎంవీ నరసింహారావు, ఏపీఎంఐపీ పీడీ బి.రఘునాథరెడ్డి, ఏపీడీ జి.ఫిరోజ్‌ఖాన్, హెచ్‌ఓలు రత్నకుమార్, నెట్టికంటయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం అక్రమ విక్రయాలపై కొరడా

యల్లనూరు : మద్యం అక్రమ విక్రయాలపై పోలీసులు కొరడా ఝుళిపించారు. యల్లనూరులోని సుధాకర్‌రెడ్డి షాపు నుంచి తిమ్మంపల్లిలోని కాశిరెడ్డి నాయన ఆశ్రమం వెనుక ఒక గదిలో రవికుమార్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డిలకు మద్యం నిల్వ చేశారు. ఈ విషయం అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, పుట్లూరు సీఐ సత్యబాబుకు అందిన సమాచారం మేరకు పుట్లూరు సీఐ సత్యబాబు, ఎస్‌ఐ వెంకట నరసింహులు శనివారం తిమ్మంపల్లికి చేరుకున్నారు. అప్పటికే అక్కడ బొలెరో వాహనంలోకి మద్యం చేరుస్తుండగా గుర్తించి పట్టుకున్నారు. మొత్తం రూ.3.50 లక్షలు విలువ చేసే 2,679 క్వార్టర్ మద్యం బాటిళ్లు, ఏడు కేసుల బీర్లతో పాటు బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మద్యాన్ని డిప్యూటీ కమిషనర్ పరిశీలించారు. కార్యక్రమంలో యల్లనూరు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

25న జాబ్‌మేళా

అనంతపురం రూరల్: జిల్లాలోని ముస్లిం, మైనార్టీల కోసం సొసైటీ ఫర్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్, ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (సీడాప్) ఆధ్వర్యంలో ఈ నెల 25న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు మైనార్టీ కార్పొరేషన్ ఇన్‌చార్జ్ ఈడీ సుబ్రహ్మణ్యం తెలిపారు. అనంతపురంలోని జిల్లా ఉపాధి కార్యాలయంతో పాటు రాయదుర్గం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా ఉంటుందని పేర్కొన్నారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

REAL ESTATE

RENT / LEASE
■ BUILDING FOR RENT / LEASE at BJP Colony Tadakaleru, Anantapur- Suitable for warehouse - Cargo Lift - 7000 sft - G+2 floors - South - West Corner. Ph:9848654353. [A-1515]

PLOT FOR SALE
■ Residential Plot 4 cents in prime location opp to Kims Savera Hospital for urgent sale west face 30 ft road. Call: 9550064164. [C-820353]

SERVICES

BUSINESS OFFER
■ మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి, లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబి డైపర్ మెషిన్, ప్లాస్టిగ్ ఉద్యోగ్ స్థాపించండి, బైబ్యాక్ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర॥ 8376001873, 9643010487, 8376089771, 011-25920179. [DA-6239]

WANTED
■ Wanted Lecturer : B.Com with MBA, BA Urdu & Telugu. Urdu Speaking Must. Location : Near SKU, Anantapur. WhatsApp: CV to 9346511313. [A-384]

■ హైదరాబాద్‌లోని వృద్ధాశ్రమంలో పనిచేయుటకు నర్సులు, కేర్ టేకర్లు, ఆడ/ మగ/ జంట కావలెను. ఫోన్: 9347556162/ 8309615249 [DA-56921]

■ ATPలోని TITAN WORLD షోరూం నందు పనిచేయుటకు వాచ్ టెక్నీషియన్స్ (Watch Technicians) కావలెను. సంప్ర॥ 15/775, శ్రీ బాలాజీ ట్రాన్స్‌పోర్ట్ బిల్డింగ్, రాజురోడ్డు, ATP. 95053 42233. [A-24]

■ ATP, ఓల్డ్ టౌన్, WATER BOTTLES DELIVERY BOYS కావలెను. 3 వీలర్ డ్రైవింగ్ వచ్చిన వారికి ప్రాధాన్యత. జీతం: 13 k. : 6303375500. [SCA25001841]

■ విజయవాడలో A/c & Coolers రెంటల్ (towerac.com) కంపెనీకి A/c టెక్నీషియన్స్-3, డోర్ డ్రైవర్లు-3, హెల్పర్లు-5, 30 సం.లోపు జీ: 18-25,000 ట్రైనింగ్/భోజనం/వసతి ఫ్రీ ✆ 90300 44622 [B-1266928]

■ మీ ఇంటి వద్దనే ఉంటూ మీ మొబైల్ ద్వారా ప్రతి రోజు 50 మెసేజ్‌లు పంపుతూ వారానికి 3,500 సంపాదించుకోండి. వివరాలకు వాట్సాప్‌లో Hi అని మేసేజ్‌చేసి కాల్ చేయండి. 82478 08801. [SCA25001840]

■ హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. Ph: 9640258899, 9640468899 [SCA25001814]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోమ్ Hyd & Vja బ్రాంచీలకు 10th ఆపై చదివిన20-50 సం॥ స్త్రీ/పు టెలికాలర్స్, సూ॥వైజర్లు, అడ్మిన్లు, అకౌంటెంట్లు,కా॥.బో+వ+జీ20-30వేలు . ఫోన్ 9491651122, 9491821122 [SCA25001389]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకటన గోరంత ! స్పందన కొండంత !!
4 లైన్లు రూ. 270/-
అదనపు లైను రూ. 60/-
ప్రతి 3 ప్రకటనలకు 1 ప్రకటన ఉచితం
ANANTHAPURAMU : 9010567770, 9492288307
DHARMAVARAM & PUTTAPARTHI : 9912220726
HINDUPUR & MADAKASIRA : 9912220723, 9705346587
GUNTAKAL & TADIPATRI : 9912220722
KADIRI : 9010593486
RAYADURG : 9010470185

క్లుప్తంగా

ఉయ్యాలవాడకు ఘన నివాళి



ఉయ్యాలవాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రెడ్డి జన సంఘం నాయకులు

రాప్తాడురూరల్: భారత జాతి గర్వించే స్వాతంత్య్ర సమరయోధుడు, తెలుగు వీరుడు, రేనాటి బిడ్డ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని రెడ్డి జన సంఘం నాయకులు కొనియాడారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 178వ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం అనంతపురం రూరల్ పాపంపేటలోని సంఘం కార్యాలయంలో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ బ్రిటిష్ దమనకాండకు వ్యతిరేకంగా పోరాడిన తొలి యోధుల్లో ఒకరు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అన్నారు. 1806లో కర్నూలు జిల్లాలో జన్మించిన నరసింహారెడ్డి చిన్ననాటి నుంచి ధైర్య సాహసాలతో పరిపూర్ణమైన న్యాయ స్వరూపంగా పేరు పొందారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సురేష్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు చిన్నరాసి చంద్రమౌళి రెడ్డి, పద్మావతి రెడ్డి,తోపుదుర్తి రామకృష్ణారెడ్డి, మంత్రి విశ్వనాథ్ రెడ్డి, కోన వెంకట శివారెడ్డి, నందికొట్కూరు రమణారెడ్డి, ముచ్చుకోట రమణారెడ్డి, పోతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు 'అనంత కథా కార్యశాల'

అనంతపురం కల్చరల్: ఔత్సాహిక రచయితలు కథల ఆవిష్కరణలో తీసుకోవాల్సిన మెళకువలను తెలిపే 'అనంత కథా కార్యశాల'ను ఆదివారం నిర్వహిస్తున్నట్లు సాహితీ స్రవంతి సంస్థ ప్రతినిధి డాక్టర్ ప్రగతి తెలిపారు. ఉదయం 9.30 గంటలకు స్థానిక లలితకళాపరిషత్తులో జరిగే కార్యక్రమంలో సీనియర్ రచయితలు వెంకటకృష్ణ, వేంపల్లె షరీఫ్, ఆర్.శశికళ, శ్రీనివాసమూర్తి కథా రచనకు సంబంధించిన సూచనలు, సలహాలు అందిస్తారన్నారు. శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాకు చెందిన 40 మందికి మాత్రమే పరిమితమని, ఔత్సాహిక యువ రచయితలు, సాహిత్యాభిమానులు విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు.

శ్రీశైలం తరలిన మాలధారులు



ఇరుముడులతో శ్రీశైలం బయలుదేరుతున్న మాలధారులు

రాప్తాడు: శివమాల ధరించి మండలం రోజులు దీక్ష చేసిన శివస్వాములు 55 మంది శ్రీశైల మల్లికార్జున స్వామికి ఇరుముడి సమర్పించేందుకు శనివారం బయలు దేరి వెళ్లారు. అంతకు ముందు గురుస్వాములు చిత్రా నాగేంద్ర, తలారి శివయ్య ఆధ్వర్యంలో ఉమా నీలకంఠేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. శ్రీశైలం మల్లన్నకు ఇరుముడి సమర్పించి.. శివరాత్రి మరుసటి రోజు దీక్ష విరమిస్తారని గురుస్వాములు తెలిపారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



మహిళల ఆరోగ్య వివరాలను తెలుసుకుంటున్న డాక్టర్ రవినాయక్

చెన్నేకొత్తపల్లి: ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలంతా ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ రవినాయక్ సూచించారు. శనివారం ఆయన మండల పరిధిలోని హరియాన్‌చెరువు గ్రామంలో ఎన్ఎస్‌గేట్ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గర్భిణులు, రక్తపోటు, మధుమేహ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి ప్రజలు సహకరించాలి



ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: నగరాభివృద్ధికి ప్రజలు సహకరించాలని మేయర్ వసీం పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని 50వ డివిజన్‌లో కార్పొరేటర్ శేఖర్ బాబు ఆధ్వర్యంలో మహిళలకు తడి, పొడి చెత్త నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ బాలస్వామితో కలసి మేయర్ వసీం పాల్గొన్నారు. పారిశుధ్యం మెరుగుదలలో తాము భాగస్వామ్యులవుతామని మెప్మా సభ్యులు, మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. చెత్తను వేరు చేసి ఇవ్వాలని మహిళలకు మేయర్ సూచించారు. కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను వేయరాదన్నారు. చెత్త సేకరణ సరిగా లేకపోతే సంబంధిత పారిశుధ్య కార్యదర్శి, ఎంహెచ్‌ఓలకు ఫిర్యాదు చేయాలని కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో ఏఈ ఉమామహేశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకులు కాకర్ల శీన, శంకర్ రెడ్డి, ముకేష్, ఆర్పీ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

పేదల బియ్యం...పొరుగున బేరం!

- యథేచ్ఛగా రేషన్ బియ్యం అక్రమ రవాణా
- అధికార అండతో రెచ్చిపోతున్న ముఠా
- అధికారులకు పట్టుబడినా మారని వైనం

రాప్తాడు: కూటమి ప్రభుత్వం వచ్చాక రేషన్ మాఫియా రెచ్చిపోతోంది. పేదలకు సరఫరా అవుతున్న చౌక బియ్యాన్ని కొందరు బొక్కేస్తున్నారు. పేదల అవసరాలను ఆసరాగా చేసుకుంటూ అందినకాడికి దండుకుంటున్నారు. రేషన్ కార్డుదారుల నుంచి తక్కువ ధరకు కొని మిల్లులు, గోదాములకు తరలిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత గంటల తరబడి రేషన్ షాపుల వద్ద క్యూలలో నిల్చునే దుస్థితి నెలకొంది. దీంతో చాలా మంది దుకాణాలకు వెళ్లడం లేదు. దీన్ని ఆసరాగా చేసుకొని డీలర్లు కూడా వ్యాపారులతో కుమ్మక్కై కేవలం 1వ తేదీ నుంచి 4వ తేదీ వరకు మాత్రమే బియ్యం పంపిణీ చేసి, స్టాక్ అయిపోయిందని చెప్పి, మిగిలిన బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారు.

పాలిష్ చేసి.. సన్నబియ్యంగా

కొంతమంది ప్రతి నెలా నియోజకవర్గంలోని ఊరూరా ఇంటింటికీ వెళ్లి కిలో రూ.15 నుంచి రూ.18తో కొనుగోలు చేస్తున్నారు. రాప్తాడు, అనంతపురం రూరల్, ఆత్మకూరు, చెన్నేకొత్తపల్లి, రామగిరి, కనగానపల్లి మండలాల్లో వాటిని ఆటోల ద్వారా ఓ చోట నిల్వ చేస్తున్నారు. ఆ తర్వాత వారి నుంచి ఓ దళారీ రూ.24 ప్రకారం కొని కర్ణాటక రాష్ట్రంలోని చెళ్లకెర, తుమకూరు తదితర ప్రాంతాల్లోని మిల్లులకు తరలిస్తున్నారు. 15 రోజులకోసారి 30 నుంచి 40 లోడ్ల బియ్యాన్ని కర్ణాటకకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. అక్కడ కేజీ బియ్యం రూ.30 నుంచి రూ.40 వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. చెళ్లకెర మిల్లుల్లో రేషన్ బియ్యాన్ని పాలిష్ చేసి సన్న బియ్యంగా మార్చుతున్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. వాటిని తిరిగి క్వింటా రూ.3,800 నుంచి రూ.4,200కు గ్రామాల్లో విక్రయిస్తూ దోపిడీ చేస్తున్నారనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి.



మరూరు టోల్ ప్లాజా దగ్గర సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించిన రేషన్ బియ్యం బస్తాల లారీ (ఫైల్)

'అధికార' ఆశీస్సులతోనే!

బెంగళూరు–హైదరాబాద్ 44వ జాతీయ రహదారి అక్రమార్కులకు వరంగా మారింది. చీకటి పడగానే ఈ మార్గంలో బియ్యం తరలింపు యథేచ్ఛగా సాగుతోంది. పోలీసులకు మామూళ్లు ఇస్తూ పట్టపగలే బియ్యాన్ని తరలిస్తున్నట్లు సమాచారం. రాప్తాడులో నలుగురు టీడీపీ నాయకులు సిండికేట్‌గా ఏర్పడి బియ్యం వ్యాపారం చేస్తున్నట్లు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ఆరు మండలాల్లోనూ అధికార పార్టీ నాయకులే నేరుగా బియ్యం అక్రమ వ్యాపారం చేస్తున్నట్లు తెలిసింది.



తుమకూరుకు తరలిస్తున్న రేషన్ బియ్యం లారీని స్వాధీనం చేసుకున్న అధికారులు (ఫైల్)

రేషన్ బియ్యం విక్రయిస్తే కఠిన చర్యలు

44వ జాతీయ రహదారిపై చౌక బియ్యం తరలిపోకుండా గట్టి నిఘా ఏర్పాటు చేశాం. ఎక్కడైనా అక్రమ బియ్యం నిల్వలు ఉన్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వొచ్చు. వెంటనే దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకుంటాం. బాధ్యులపై కేసులు నమోదు చేయిస్తాం. కార్డుదారులు బియ్యం అమ్ముకుంటే కఠిన చర్యలు చేపడతాం. అవసరం ఉంటేనా బియ్యం తీసుకోవాలి. కేవలం కార్డు కోసం వేలిముద్రలు వేసి బియ్యం అమ్ముకుంటే సహించేది లేదు. దీనిపై ప్రత్యేక నిఘా ఉంచేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తాం.

– విజయకుమారి, తహసీల్దార్, రాప్తాడు

పరిసరాల పరిశుభ్రతతోనే రోగాలు దూరం



చెన్నేకొత్తపల్లిలో చెత్తను సేకరిస్తున్న పారిశుధ్య కార్మికులు



ఆత్మకూరులో ఇంటింటికీ తిరిగి చెత్తను సేకరిస్తున్న అధికారులు

- ఇంటింటా చెత్త సేకరణ ప్రారంభం

ఆత్మకూరు/చెన్నేకొత్తపల్లి: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే రోగాలు దరిచేరవని, ఈ దిశగా అందరూ కృషి చేయాలని అధికారులు పేర్కొన్నారు. 'స్వచ్ఛ భారత్ మిషన్' కార్యక్రమంలో భాగంగా శనివారం ఆత్మకూరు, చెన్నేకొత్తపల్లి గ్రామాల్లో అధికారులు ఇంటింటికీ తిరిగి చెత్తను సేకరించారు. ఆత్మకూరులో ఈఓఆర్డీ కామాక్షి, పంచాయతీ సెక్రటరీ మహబూబ్‌బాషా ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ చెత్తను రోడ్లపై వేయరాదన్నారు. ముఖ్యంగా హోటళ్లు, దుకాణాలు, కూరగాయల వ్యాపారులు రోడ్లపై పేపర్లు, చెత్త, వ్యర్థాలు వేయరాదన్నారు. ఎక్కడైనా చెత్త ఎక్కువగా ఉంటే పంచాయతీ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. చెన్నేకొత్తపల్లిలో పంచాయతీ ఈఓ నారాయణస్వామి ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు.

హంస వాహనంపై శివపార్వతుల దర్శనం

అనంతపురం కల్చరల్: నగరంలోని మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండరామాలయం వేదికగా సాగుతున్న శివరాత్రి బ్రహ్మోత్సవాలలో శనివారం రాత్రి మహాశివుడు పార్వతీ సమేతుడై హంస వాహనంపై దర్శనమిచ్చాడు. ఒకటో రోడ్డు నుంచి మూడో రోడ్డు వరకూ ఆది దంపతుల నగరోత్సవం సాగింది. శాకంబరీదేవి అలంకారంలో దర్శనమిచ్చిన ఉత్సవమూర్తులకు భక్తులు అడుగడుగునా హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారి కీర్తనలతో భజన బృందాలు నగరవీధులను మార్మోగించాయి ఆలయంలో కాశీవిశ్వేశ్వరుడికి మహాన్యాస పూర్వక ఏకదార రుద్రాభిషేకాలను, దీక్షా హోమాన్ని భక్తిశ్రద్ధలతో జరిపించారు. అలాగే స్వామి వారికి నీరాజనాలర్పిస్తూ వాసవి నృత్య కళానికేతన్ శిక్షణాలయం వారు కూచిపూడి, భరతనాట్యాలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమేష్‌బాబు, భక్తబృందాలు నరేంద్ర చౌదరి, శ్రీనివాసులు, ఎర్రిస్వామి, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.



హంస వాహనంపై పార్వతీ పరమేశ్వరులు

28న ఉమర్‌ఆలీషా జయంతి వేడుకలు

అనంతపురం కల్చరల్: ఐదు శతాబ్దాలకు పైగా పిఠాపురంలోని విశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం ద్వారా ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న 6వ పీఠాధిపతులు కవిశేఖర డాక్టర్ ఉమర్ ఆలీషా 140వ జయంతి వేడుకలు అనంతపురంలో ఈనెల 28న ఘనంగా జరగనున్నాయి. ఈ మేరకు జిల్లా సాహితీ సమితి అధ్యక్షుడు రియాజుద్దీన్ అహ్మద్ వివరాలను తెలియజేశారు. ఏటా పిఠాపురం,భీమవరం,బెంగళూరు,హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి వేడుకలు ఈసారి నగరంలో నిర్వహించడానికి పీఠం తీర్మానించడం విశేషమన్నారు. శుక్రవారం స్థానిక లలితకళాపరిషత్తు వేదికగా జరిగే వేడుకలకు పీఠం నవమ పీఠాధిపతులు డాక్టర్ ఉమర్ ఆలీషా విశిష్ట అతిథిగా విచ్చేస్తున్నారని తెలిపారు. 'భారతదేశం – మత సామరస్యం' అనే సదస్సులో స్వామి వారితో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, సీనియర్ రచయిత డాక్టర్ పతికి రమేష్ నారాయణ ప్రసంగిస్తారన్నారు. వ్యాసరచన, సైన్సు ఫేర్‌లలో విజేతలుగా నిలిచే విద్యార్థులకు బహుమతులను అందజేస్తారన్నారు. సాహితీ అభిమానులు విచ్చేసి సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలి

కనగానపల్లి: వసతి గృహాల్లోని విద్యార్థులకు పౌష్టిక విలువలతో కూడిన పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలని సమగ్రశిక్ష జిల్లా అధికారి దేవరాజు మోడల్ స్కూల్ సిబ్బందిని ఆదేశించారు. ఆహారం, నీరు కలుషితం కాకుండా చూసుకోవాలన్నారు. ఆహారం కలుషితం కాగా, వసతి గృహంలోని పలువురు విద్యార్థులు ఇటీవల అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం సమగ్రశిక్ష జిల్లా అధికారి దేవరాజు మోడల్ స్కూల్, వసతి గృహాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... విద్యార్థులకు చదువుతో పాటు ఆరోగ్యం కూడా ఎంతో ముఖ్యమన్నారు. దీన్ని గుర్తించి వారిని సరైన పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. వసతి గృహంలోని విద్యార్థినులకు మినరల్ వాటర్ సదుపాయాన్ని కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ అరుణమ్మ, సర్పంచ్ రామకృష్ణ, ఉపాధ్యాయులు, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.



మోడల్ స్కూల్ వసతి గృహాన్ని పరిశీలిస్తున్న సమగ్రశిక్ష జిల్లా అధికారి దేవరాజు

నేను చెప్పిన వారి పేరేదీ!

- సెక్టోరియల్ అధికారుల జాబితాలో పేర్ల గల్లంతుపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం
- జాబితాను అమలు చేయకుండా నిలుపుదల చేయాలంటూ ఆదేశం
- తలలు పట్టుకుంటున్న విద్యాశాఖ అధికారులు



అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారుల ఎంపిక జాబితాలో తాము చెప్పిన వారి పేర్లు లేకపోయే సరికి అధికార పార్టీ ముఖ్య ప్రజాప్రతినిధులు అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. సమగ్రశిక్షలో ఏఎంఓ, అసిస్టెంట్ ఏఎంఓ (జనరల్, కన్నడ), జీసీడీఓ, అసిస్టెంట్ సీఎంఓ, అసిస్టెంట్ ఐఈడీ, ఏఎస్ఓ పోస్టుల భర్తీకి ఆర్నెల్ల కిందట నోటిఫికేషన్ విడుదల చేశారు. వీటిలో ఏఎస్ఓ, అసిస్టెంట్ ఐఈడీ పోస్టులకు అర్హత కల్గిన అభ్యర్థులు లేరంటూ తక్కిన పోస్టులను ఎంపిక చేసి ఆమోదం కోసం కమిషనర్‌కు పంపారు. ఏఎంఓగా ఆనంద భాస్కర్‌రెడ్డి, జీసీడీఓగా కవిత, అలెస్కోగా గురుమునికృష్ణ, అసిస్టెంట్ ఏఎంఓగా ఫణిరాజును నియమిస్తూ కమిషనర్ ఆమోదముద్ర వేశారు. ఈ మేరకు గురువారం రాత్రి డీఈఓ కార్యాలయానికి ఉత్తర్వులు అందాయి.

ప్రజాప్రతినిధులకు కోపం వచ్చి..

అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ముగ్గురు ఒకే సామాజిక వర్గానికి చెందిన ప్రజాప్రతినిధులకు తీవ్రస్థాయిలో కోపం వచ్చింది. కొందరు టీచర్లు ఆ ప్రజాప్రతినిధుల వద్దకు వెళ్లి అధికారులపై లేనిపోని చాడీలు చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. 'మీరు చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదు. మీమాటకు విలువ ఇవ్వడం లేదు' అని రెచ్చగొట్టారు. దీంతో ఆ ముగ్గురు ప్రజాప్రతినిధులు ఎవరికి వారు అధికారులకు ఫోన్లు చేసి తమస్థాయిలో రెచ్చిపోయినట్లు విద్యాశాఖలో చర్చ జరుగుతోంది. తాము రెకమెండ్ చేసిన టీచర్ల పేర్లు లేకపోతే.. ఏ ఒక్కరినీ చేర్చుకోవద్దని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అధికారులకు తలనొప్పిగా ఎంపిక ప్రక్రియ

సమగ్రశిక్ష కార్యాలయం సెక్టోరియల్ ఆఫీసర్ల పోస్టుల భర్తీ అధికారుకు తలనొప్పిగా మారింది. పూర్వపు అధికారి నిర్వాకం నేటికీ సమగ్రశిక్షను వెంటాడుతోంది. ఆ అధికారి తీసుకున్న అనాలోచిత నిర్ణయంతో ప్రాజెక్ట్ చరిత్రలో తొలిసారి సెక్టోరియల్ అధికారులు లేని ప్రాజెక్ట్‌గా ఖ్యాతి గడించింది. స్వయంగా విద్యాశాఖ కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వులకు వక్రభాష్యం చెబుతూ విద్యాసంవత్సరం మధ్యలో ఒకేమారు సెక్టోరియల్ ఆఫీసర్లందరినీ రిలీవ్ చేశారు. అంతే హడావుడిగా ఆయా పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేశారు. దరఖాస్తులు స్వీకరించారు. అభ్యర్థుల ఇంటర్వ్యూలు, ఆ తర్వాత సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేశారు. ఎలాగోలా కమిషనర్ నుంచి నాలుగు పోస్టులను భర్తీ చేస్తూ ఉత్తర్వులు రావడంతో.. వాటిని కూడా అమలు చేయకుండా రాజకీయం చేసి అడ్డుకుంటున్నారు. ఈ నాలుగు పోస్టులు భర్తీ చేసేందుకు 6 నెలల కాలం పట్టింది. తక్కిన నాలుగు ఖాళీల భర్తీ ఎప్పుడు చేస్తారో అధికారులకే తెలియాలి. దీనికితోడు అర్హత లేకపోయినా ఖాళీల్లో తమవారినంటే తమవారినే తీసుకోవాలంటూ ప్రజాప్రతినిధులు సిఫార్సు లేఖలతో పాటు ఫోన్లు చేసి ఒత్తిళ్లు చేస్తుండడంతో సంబంధిత అధికారులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

'సమగ్ర అభివృద్ధి'పై శిక్షణ

ఆత్మకూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం అంగన్‌వాడీ కార్యకర్తలకు సమగ్ర అభివృద్ధిపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా మెరుగైన బోధన అంశాలతో పాటు చిన్నారులతో నడుచుకోవాల్సిన తీరును వివరించినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లావణ్య, శ్రీవాణి తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

24న రథోత్సవం

పామిడి: మండలంలోని వంకరాజుకాలువ పంచాయతీ పరిధిలోని పెన్నప్పగుడి వద్ద ఈ నెల 24న ఎర్రితాత, పక్కీరప్ప 24వ రథోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు శనివారం గ్రామస్తులు తెలిపారు. అలాగే 25, 26 తేదీల్లో వరుసగా న్యూకేటగిరి, ఆరుపళ్ల విభాగపు ఎద్దుల రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహిస్తామన్నారు. న్యూకేటగిరీ విభాగపు విజేత వృషభాలకు 1,2,3,4,5,6,7,8,9 స్థానాలకు వరుసగా రూ.50 వేలు, రూ.35 వేలు, రూ.25 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.5 వేలు, రూ.4 వేలు చొప్పున నగదు బహుమతులు ఉంటాయన్నారు.

పాఠశాలకు ఆర్థిక సాయం

రాప్తాడు: ప్రసన్నాయపల్లి గ్రామంలోని వినయ్ కుమార్ పాఠశాలలో మరమ్మతుకు గురైన వాటర్ ప్లాంట్ బాగుచేసేందుకు అవసరమైన రూ.20 వేలను పూర్వ విద్యార్థులు శనివారం అందించారు. పాఠశాలలో 1999–2000లో చదివిన పూర్వ విద్యార్థులు గతంలోనే రక్షిత నీరందించేందుకు వాటర్ ప్లాంట్ అందజేశారు. అయితే అది మరమ్మతుకు గురికాగా, తాగునీటికోసం విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. హెచ్ఎం గాలి రవీంద్ర ద్వారా విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు వినయ కుమార్, సోమసేనా రెడ్డి, ప్రతాప్ రెడ్డి, మహేశ్, నారాయణ రెడ్డి తదితరులు వాటర్ ప్లాంట్ మరమ్మతు కోసం శనివారం రూ.20 వేలు అందించారు.

తపాలా ఉద్యోగుల మహాసభ నేడు

అనంతపురం సిటీ: తపాలా ఉద్యోగుల కో–ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో నగరంలో ఆదివారం మహాసభ నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, హర్షవర్ధన్‌రెడ్డి శనివారం తెలిపారు. శ్రీనివాసనగర్‌లోని సొసైటీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు మహాసభ ప్రారంభమవుతుందన్నారు.

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ

అనంతపురం : నగరంలోని గ్రూప్–2 పరీక్ష కేంద్రాలను జిల్లా ఎస్పీ పి.జగదీష్ శనివారం పరిశీలించారు. ఎస్ఎస్‌బీఎన్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని సందర్శించి బందోబస్తు ఏర్పాట్లపై సంబంధిత పోలీసు అధికారులకు ఆదేశాలిచ్చారు. పరీక్ష కేంద్రానికి సమీపంలోని జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లను మూసివేయించాలన్నారు. అభ్యర్థులు ఎలక్ట్రానిక్ పరికరాలు, వస్తువులను పరీక్ష కేంద్రంలోకి తీసుకు రాకూడదన్నారు. ఎస్పీతో పాటు అనంతపురం డీఎస్పీ వి.శ్రీనివాసరావు, టూటౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్ తదితరులు ఉన్నారు.

సాంకేతికత జోడిస్తే సాగులో లాభాలు



రైతుబడి అగ్రిషో వ్యవసాయ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సవిత

రాప్తాడు: సంప్రదాయ వ్యవసాయానికి సాంకేతికతను జోడిస్తే అధిక దిగుబడులు సాధ్యమవుతాయని, తద్వారా వ్యవసాయం లాభసాటిగా మారుతుందని మంత్రి సవిత అన్నారు. అత్యాధునిక వ్యవసాయ సమాచారంతో రాప్తాడులో ఏర్పాటు చేసిన రైతుబడి అగ్రిషోను శనివారం ఆమె ప్రారంభించారు. రెండురోజుల పాటు నిర్వహించే అగ్రిషోలో తొలి రోజు ఏర్పాటు చేసిన వివిధ వ్యవసాయ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ.. అనంతపురం జిల్లాను ఇండస్ట్రియల్ హబ్‌గా మార్చడమే కాకుండా, హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఇలాంటి ప్రదర్శనల ద్వారా రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉంటాయన్నారు. జిల్లా వ్యాప్తంగా రైతులు రైతుబడి అగ్రిషో వ్యవసాయ ఎగ్జిబిషన్‌ను తిలకించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పరిటాల సునీత, కాలవ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు చెన్నేకొత్తపల్లి మండలంలో 'తోపుదుర్తి' పర్యటన

చెన్నేకొత్తపల్లి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాప్తాడు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆదివారం మండలంలో పర్యటించనున్నారు. వెంకటంపల్లి, ఓబులంపల్లి గ్రామాల్లో రైతులతో సమావేశమవుతారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జోలా రామచంద్రారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు వెంకటంపల్లిలో హంద్రీ–నీవా కాలువకు కాంక్రీట్ లైనింగ్‌కు సంబంధించి రైతులతో చర్చిస్తారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు, రైతులు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

క్షతగాత్రులకు పరామర్శ

అనంతపురం కార్పొరేషన్: స్థానిక సర్వజనాస్పత్రిలో అడ్మిషన్‌లో ఉన్న శింగనమల మండలం నాగులగుండం తండాకు చెందిన గిరిజనులను వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు నాయక్ శనివారం పరామర్శించారు. ఈ నెల 21న పొట్ట కూటి కోసం వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్న సమయంలో గార్లదిన్నె మండలం కల్లూరు వద్ద బొలెరో వాహనం ప్రమాదానికి గురై సోనియా బాయి, నీలాక్షి, రామక్క తదితర కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని శ్రీనివాసులు నాయక్ పరామర్శించారు. 11 మంది గిరిజనులు ప్రమాదానికి గురైతే ప్రభుత్వం ఏమాత్రమూ పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎం.రవికుమార్ నాయక్, డీ భాస్కర్ నాయక్, రమేష్ నాయక్, లక్ష్మణ్ నాయక్, మోటో నాయక్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ తీరుతో విద్యారంగం నిర్వీర్యం

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోందని, తద్వారా పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజల జీవితాలతో ఆటలాడుతోందని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్ అన్నారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎనిమిది నెలల కాల వ్యవధిలోనే కూటమి ప్రభుత్వం రూ.లక్షల కోట్ల అప్పు చేసింది కానీ విద్యాభివృద్ధికి ఎలాంటి చర్యలూ చేపట్టలేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, తల్లికి వందనం ఇవ్వలేదని, నాడు–నేడు పనులను అటకెక్కించిందని ధ్వజమెత్తారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడితే ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో విద్యార్థి విభాగం నగరాధ్యక్షుడు కైలాష్, నాయకులు పవన్, నిశాంత్‌రెడ్డి, బాబా, శేఖర్, నాని, వంశీ తదితరులు పాల్గొన్నారు.

'పది' స్టడీ మెటీరియల్ పంపిణీ



అందుకున్న మెటీరియల్‌తో విద్యార్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: అనంతపురం రూరల్ మండలం ఆలమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శనివారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. నారాయణరెడ్డి సహకారంతో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎన్.రమణారెడ్డి ఆధ్వర్యంలో అందజేశారు. ఈ స్టడీ మెటీరియల్‌ను పూర్తిగా చదివితే 90 శాతం మార్కులు సాధించవచ్చని హెచ్ఎం అశోక్‌రావు తెలిపారు. కార్యక్రమంలో దాత నారాయణరెడ్డి, రఘునాథ్ రెడ్డి, గంగాధర్, పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాసులు, మురళీ, లక్ష్మి పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుడిపై దాడి

అనంతపురం: వేణుగోపాల్ నగర్‌లో పారిశుధ్య కార్మికులపై దాడి జరిగింది. వన్ టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మున్సిపాలిటీలో అవుట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న ఆదినారాయణ శనివారం వేణుగోపాల్ నగర్‌లో మురుగును తొలగిస్తున్నాడు. గీతాంజలి అనే మహిళ ఇంటి వద్దకు వెళ్లి, అక్కడే కొత్త ఇల్లు నిర్మిస్తున్న క్రమంలో ప్లాస్టిక్ సంచులను తొలగించాలని కోరాడు. కాలువ పైభాగంలో ఉన్న సంచులను తొలగించాలని సూచించాడు. దీంతో మాటామాట పెరిగి గొడవ అయింది. గీతాంజలి సహనం కోల్పోయి ఆదినారాయణపై దాడి చేసింది. అక్కడే ఉన్న తోటి మహిళా పారిశుధ్య కార్మికురాలిని దూషించింది. ఈ క్రమంలోనే పారిశుధ్య కార్మికులందరూ అక్కడికి చేరుకున్నారు. గీతాంజలిపై మూకుమ్మడిగా దాడి చేశారు. పోలీసులకు సమాచారం రావడంతో ఇరువర్గాలను వన్‌టౌన్ స్టేషన్‌కు తరలించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేశారు.

IndusInd Bank - CFD
COMMERCIAL VEHICLES FOR SALE
APE XTRA LDX PU BS VI
2022 MODEL AP39 UC 1320
Cell : 97039 74853
11/168-2, 2nd Floor, Meda Ramaiah Setty Mansion, Backside Meda Petrol Bunk, Sapthagiri Circle, ANANTAPUR.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
అనంతపురము డివిజన్
9912220732, 9912220719, 9912220724
9010223702, 9908363676, 9010567770, 8008554500